క్లుప్తంగా

పాఠశాల ఆకస్మిక తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న డిప్యూటీ డీఈఓ

హనుమంతునిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిప్యూటీ డీఈఓ ఏ చంద్రమౌలేశ్వర్ మంగళవారం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటశాలను పరిశుభ్రంగా ఉంచాలని కుకింగ్ ఏజెన్సీలకు సూచించారు. అనంతరం తరగతి గదులు పరిశీలించారు. విద్యార్థుల నోట్ బుక్స్, డైరీలు, ట్యాప్‌లు, వర్కు బుక్స్ పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చదువులో వెనకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆంగ్ల బోధనలో నాణ్యమైన విద్యా బోధన అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు జి.పెద్దిరాజు, ఎస్ రమణయ్య, హెచ్‌ఎం జీవీ సురేష్‌బాబు ఉన్నారు.

వైఎస్సార్ రైతు భరోసా నగదు జమ

వలేటివారిపాలెం: మండలానికి ఈ ఏడాది రెండవ విడతగా 7,075 మంది రైతులకు వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద రూ.2.83 కోట్లు జమైనట్లు వ్యవసాయాధికారి హేమంత్ భరత్‌కుమార్ తెలిపారు. వైఎస్సార్ భరోసా కింద రూ.2 వేలు, పీఎంకిసాన్ కింద రూ.2 వేలు జమవుతాయని పేర్కొన్నారు.

నేడు జగనన్నకు చెబుదాం

కందుకూరు: ప్రజా సమస్యల పరిష్కారం మండల స్థాయిలో నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమం బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జరగనుంది. కార్యక్రమానికి కలెక్టర్ ఎం హరినారాయణన్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నారు. కందుకూరు మండల, పట్టణవాసులు పాల్గొని సమస్యలు పరిష్కరించుకోవాలని అధికారులు సూచించారు.

జాతీయస్థాయి బ్యాడ్మింటన్‌కు అమృత



బ్యాడ్మింటన్‌కు ఎంపికైన అమృత

ఉలవపాడు: జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు కరేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి చొటూరి అమృత ఎంపికైనట్లు వ్యాయామ అధ్యాపకుడు ఓగుబోయిన శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల ఆత్మకూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో చూపిన ప్రతిభ ఆధారంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అండర్ 19 జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ బ్యాడ్మింటన్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనుంది. జాతీయస్థాయి పోటీలకు ఎంపికయిన అమృతను ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీధర్ రెడ్డి అభినందించారు.

శనగ విత్తనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం

జరుగుమల్లి: మండలంలో శనగ సాగు చేస్తున్న రైతులకు ఆర్బీకేల ద్వారా శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు ఏఓ డి.యుగంధరరెడ్డి తెలిపారు. మంగళవారం నర్సింగోలు, పైడిపాడు రైతు భరోసా కేంద్రాల్లో శనగ విత్తనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఏఓ పరిశీలించారు. శనగ సాగుకు ముందుగా విత్తనాలను ట్రైకోడెర్మావిరిడీతో శుద్ధి చేసుకోవాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం: మండలంలోని అంగిరేకులపాడు వద్ద ఉన్న మన్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను సెబ్ అధికారులు పట్టుకుని లింగసముద్రం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్సై ఎం.బాజీబాబు తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున అంగిరేకులపాడు వద్దున్న మన్నేరు నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు సెబ్ సీఐ డి.వెంకటేశ్వర్లుకు సమాచారం తెలియడంతో ఎస్సై డి.మౌలాలి, సిబ్బందితో కలిసి ఇసుక ట్రాక్టర్‌పై దాడి చేసి అంగిరేకులపాడు వద్ద పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించడంతో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అమరవీరుల ఆశయసాధనకు పోరాడదాం

సింగరాయకొండ: అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకుడు కె.నాంచార్లు కోరారు. మండల కేంద్రంలోని పాత పశువుల సంత వద్ద పాండురంగారావు స్థూపం వద్ద మంగళవారం అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. నాంచార్లు మాట్లాడుతూ.. చంద్ర పుల్లారెడ్డి, పైలా వాసుదేవరావు, పాండురంగారావు ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలు తీసుకొస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్లక్ష్యం చేస్తోందని దుయ్యబట్టారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఆర్.మోహన్, బాబూరావు, దొక్కా కోటేశ్వరరావు, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో వైద్యశాల అభివృద్ధి

● ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి



వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మానుగుంట

ఉలవపాడు: అందరి సహకారంతో వైద్యశాల అభివృద్ధి చేయాలని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి అన్నారు. స్థానిక సీహెచ్‌సీ వైద్యశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ వైద్యశాల పేదల వైద్యశాల అని, దీని అభివృద్ధికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులను తీసుకుని వచ్చేలా కృషి చేయాలన్నారు. సుమారు రూ.50 లక్షల నిధులు టార్గెట్‌గా పెట్టుకుని అవకాశాలను వెతికి పట్టుకోవాలని తెలిపారు. వైద్యశాల అభివృద్ధిలో భాగంగా నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. దానికి సంబంధించి మీటర్ కనెక్షన్‌కు అదనంగా రూ.45 వేలలతో కేబుల్ కూడా కొనుగోలు చేయాలని నిర్ణయించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్యశాలలో అన్ని పరికరాలు త్రీఫేస్‌తో పనిచేసేలా నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. రోగుల కోసం నూతనంగా బెడ్‌షీట్లు కొనాలని కమిటీ సభ్యులు తీర్మానించారు. ఒంగోలు, నెల్లూరు నుంచి మందులు, రక్త పరీక్షల కిట్లు తీసుకురావడానికి ఖర్చులు అధికంగా అవుతున్నాయని, నెలకు ఎంత ఖర్చు అవుతుందో తెలియచేయాలని తెలిపారు.

నూతనంగా ముగ్గురు వైద్యులు వైద్యశాలకు వచ్చారని, వారు బాధ్యతగా పనిచేయాలని తెలియచేశారు. మండల కేంద్రమైన ఉలవపాడులోని మెయిన్‌రోడ్‌లో ఆక్రమణలు అధికంగా ఉన్నాయని, దీనిపై కోర్టు నిర్ణయాలను పాటించాలని అధికారులకు తెలియచేశారు. అధికారులు చట్టప్రకారం నడుచుకోవాలని తెలియచేశారు. ఎంపీడీఓ చెంచమ్మ, సర్పంచ్ నాగలక్ష్మి, వైద్యాధికారి ఐశ్వర్య తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

‘వై ఏపీ నీడ్స్ జగన్’ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న హుసేన్‌రెడ్డి

పామూరు: పామూరులో ఈ నెల 9, 10 తేదీల్లో జరగనున్న వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, పీఎస్ వి.బ్రహ్మానందరెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమ విజయవంతంపై సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ఉపసర్పంచ్ యాదాల సాయికిరణ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కార్యక్రమం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమై 5 గంటల వరకు సచివాలయ పరిధిలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలుచేస్తున్న పథకాలు, ప్రభుత్వ పథకాలపై టీవీల ద్వారా ప్రదర్శన ఉంటుందన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు జెండా ఆవిష్కరణ, ప్రజాసమస్యల తెలుసుకోవడం, పరిష్కారానికి చర్యలపై దృష్టి సారిస్తామన్నారు. రాత్రి 7 గంటల నుండి 9 గంటల వరకు సచివాలయ పరిధిలో గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాలను తెలుసుకుంటూ వారి వద్ద నుంచి సమస్యల వివరాలు తెలసుకుని పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ యూత్ మండల అధ్యక్షుడు యాదాల సాయికిరణ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సెంట్రింగ్‌చాంద్‌బాషా, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఖాదర్‌బాషా, యాటా రాఘవేంద్ర, జి.వెంకటేశ్వరరెడ్డి, జె.గోవిందయ్య, ఆకుపాటి వెంకటేష్, నీరుకట్టు రాసూల్ పాల్గొన్నారు.

వై ఏపీ నీడ్స్ జగన్‌ను విజయవంతం చేయాలి

జరుగుమల్లి: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె.జలజాక్షి తెలిపారు. ఈ నెల 9 నుంచి 23వ తేదీ వరకు అన్ని సచివాలయాల్లో సంక్షేమ పథకాల లబ్ధి వివరాలు ప్రదర్శిస్తామని పేర్కొన్నారు. 9న జరుగుమల్లి, 10న నందనవనం, 14న వావిలేటిపాడు, 15న చింతలపాలెం, 16న చిరికూరపాడు, 17న నర్సింగోలు, 20న పైడిపాడు, 21న చతుకుపాడు, 22న కామేపల్లి, 23న కె.బిట్రగుంటలో కార్యక్రమాలకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని ఆదేశించారు. రెండు రోజుల ముందు వలంటీర్లు ఇంటింటికీ తిరిగి కార్యక్రమంపై అవగాహన కల్పించాలని, ఈకేవైసీ తీసుకోవాలని సూచించారు.

చెరువుల్లో లే అవుట్‌లు వేస్తే కఠిన చర్యలు



లేఅవుట్‌లను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఎస్ఈ, డీఈ

పామూరు: చెరువుల్లో లేఅవుట్‌లు వేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఎస్ఈ లక్ష్మిరెడ్డి అన్నారు. స్థానిక కందుకూరు రోడ్డులోని కొత్తచెరువును కొందరు ఆక్రమించి లేఅవుట్‌లు వేయడంతో పాటు చెరువు కట్టను ప్రొక్లెయిన్‌తో పగులగొట్టినట్లు వచ్చిన సమాచారం మేరకు మంగళవారం ఇరిగేషన్ ఎస్ఈ లక్ష్మిరెడ్డి, డీఈ రవి క్షేత్రస్థాయిలో చెరువు కట్ట, లేఅవుట్‌లు వేసిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ సిద్దవటం రవీంద్రారెడ్డి అనేవ్యక్తి చెరువు కట్టను ప్రొక్లెయిన్‌తో పగులగొట్టించినట్లు తమ దృష్టికి వచ్చిందని దీనిపై ఏఈ శ్రీనివాసులుచేత స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయించినట్లు తెలిపారు. సర్వేనంబర్ 398, 399 లో మొత్తం 70 ఎకరాలపైగా చెరువు ప్రాంతం ఉందన్నారు. తక్షణం చెరువు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం ఆధారంగా హద్దులు ఏర్పరచి, తొట్టిప్రాంతంలో లేవుట్‌లు వేసిన వారికి నోటీసులు ఇవ్వాలని డీఈ రవి, జేసీ శ్రీనివాసులుకు ఎస్ఈ సూచించారు. ఆయన వెంట వీఆర్ఓ సరస్వతి, సర్వేయర్ మహేష్, రత్నకుమార్, పలువురు పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల్లో సంక్షేమ లబ్ధి బోర్డులు ప్రదర్శించాలి

మర్రిపూడి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి వివరాలను సచివాలయాల్లో ప్రదర్శించాలని ఎంపీడీఓ ఎస్.సుదీపా మంగళవారం తెలిపారు. బోర్డుల ప్రదర్శనకు సంబంధించి ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. వలంటీర్లు తమ పరిధిలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బ్రోచర్లు అందజేసి, ఈకేవైసీ చేయాలన్నారు. 9న మర్రిపూడి, 10న గుండ్లసముద్రం, 14న కూచిపూడి, 15న జువ్విగుంట, 17న చిమట, 20న దర్శవరం, 21న పన్నూరు, 22న కెల్లంపల్లి, 23న అంకేపల్లి గ్రామాల్లో అన్ని శాఖల ఉద్యోగులతోపాటు మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

బస్సుయాత్రను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు

సీఎస్‌పురం (పామూరు): కనిగిరిలో బుధవారం జరగనున్న సామాజిక సాధికార బస్సుయాత్రను జయప్రదం చేయాలని ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాల్లో సైతం వారికే సీఎం ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. మంత్రి పదవులతో పాటు నామినేటెడ్ పోస్టుల్లో సైతం ప్రాధాన్యం ఇచ్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమన్నారు. కనిగిరిలో జరిగే బస్సుయాత్ర కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. మైనారిటీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్.బజాజ్ బుజ్జి, యూత్ మండల అధ్యక్షుడు యం.అటేలయ్య, జాని, ఇర్లా వీరాంజనేయులు, మితికాల గురవయ్య, బొట్లా చిరంజీవి, చీపి శ్రీనివాసులు, పలువురు నాయకులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రతాపురెడ్డి

హనుమంతునిపాడు: ఆరోగ్య సబ్ సెంటర్ల పరిధిలో ఆశాలు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు సక్రమంగా అందించాలని మెడికల్ అధికారి మూరక ప్రతాపురెడ్డి అన్నారు. స్థానిక పీహెచ్‌సెంటర్‌లో మంగళవారం ఆశాలు, ఏఎన్ఎంలకు, ఎంఎల్‌హెచ్‌పీలకు సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌హెచ్‌పీలు సెంటర్లలో అందుబాటులో ఉండి ప్రజలకు వైద్య సేవలందించాలి. ఆశాలు, ఏఎన్ఎంలు గ్రామాల్లో ప్రజలకు సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం చిన్నారులకు హెల్త్ కేర్ కిట్లు పంపిణీ చేశారు. డాక్టర్ సందీప్, సీహెచ్ఓ కేవీ చెన్నయ్య, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



బాణసంచా విక్రేతలతో మాట్లాడుతున్న సీఐ రంగనాథ్

సింగరాయకొండ: దీపావళి పండగ సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తున్న వారు నిబంధనలు పాటించాలని సీఐ దాచేపల్లి రంగనాథ్ సూచించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో మంగళవారం లైసెన్స్‌దారులతో నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడారు. దుకాణాల ఏర్పాటుకు 17 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దుకాణాల మధ్య దూరం తప్పనిసరిగా ఉండాలని, ఇసుక, నీరు సిద్ధంగా ఉంచుకోవాలని స్పష్టం చేశారు. దుకాణాలు ఉండే మూడు రోజులపాటు అగ్నిమాపక సిబ్బంది పర్యవేక్షణ ఉంటుందన్నారు. నిబంధనలు పాటించని వారి లైసెన్స్ రద్దు చేస్తామని సీఐ హెచ్చరించారు. ఎస్సై టి.శ్రీరామ్ పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలించిన ఆర్డీఓ



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ జాన్ ఇర్విన్

హనుమంతునిపాడు: మండల పరిధి ఆనందపురం అగ్రహారం రెవెన్యూలోని అక్రమణ రిజిష్టర్ చేసి ఇతరులకు అమ్మిన భూముల రికార్డులను కనిగిరి డివిజన్ ఆర్డీఓ పాలపర్తి జాన్ ఇర్విన్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనందపురం అగ్రహారం రెవెన్యూలోని సర్వేనంబర్ 1లో గత 20 సంవత్సరాల క్రితం పేదలకు ప్రభుత్వం వారు డీకే పట్టాలు ఇచ్చారు. అందులో ఆ గ్రామానికి చెందిన సూరేబోయిన బాలయ్య, సూరేబోయిన బాలగురవయ్య మరో ముగ్గురు కలిసి భూమి మాది, మా పెద్దలు సంపాదించిన ఆస్తి అని ఆక్రమణ చేసి 4/3/2020 సంవత్సరం గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన గుర్రం కోటయ్య కుమారుడు అనంత క్రిష్ణకు 120 ఎకరాలు భూమిని జీపీ ఇస్తూ రిజిష్టర్ చేయించారు. భూమి అమ్మిన వారిపై క్రిమినల్ కేసు కూడా ఎఫ్ఐఆర్ నమోదైంది. కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీ, ఆర్డీలు కూడా సిట్ తయారు చేశారన్నారు. అక్రమంగా రిజష్టర్ జరిగిన భూమిపై విచారణ లోతుగా జరుగుతుందన్నారు. రెవెన్యూ రికార్డులు జాగ్రత్తగా నిష్పక్షపాతంగా విచారణ చేస్తామన్నారు. దోషులు ఎవరైన కఠిన చర్యలు తప్పవన్నారు. ఆ భూములకు సంబంధించిన రికార్డులు పరిశీలించి అధికారికంగా అన్ని వివరాలు పోలీసులకు అందజేస్తామన్నారు.

వల్లూరమ్మ ఆలయంలో బాలినేని పూజలు



వల్లూరమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న బాలినేని శ్రీనివాసరెడ్డి, మారం వెంకారెడ్డి

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలే శ్రీనివాసులు, అర్చకులు నాగేశ్వరరావు, ఉమాశంకర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బాలినేనికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. కుంకుమార్చన, గోత్ర నామార్చన పూజలు నిర్వహించి ఆలయ మర్యాదలతో సత్కరించారు. అనంతరం అద్దంకి నియోజకవర్గ పరిశీలకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి దంపతులు వల్లూరమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మొక్కులు కార్యక్రమంలో బాలినేనితోపాటు అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య, టీటీడీ బోర్డు మెంబర్ శిద్దా సుధీర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బాచిన గరటయ్య, ఎమ్మెల్సీ పోతుల సునీత, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, పోతుల సురేష్, కుందం హనుమారెడ్డి, అద్దంకి, సంతనూతలపాడు, దర్శి నియోజకవర్గాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

రైతుల అభిప్రాయం మేరకు నిర్ణయం



మోపాడులో ఆయకట్టు రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఇరిగేషన్ డీఈ రవి

పామూరు: మండలంలోని మోపాడు రిజర్వాయర్ ఆయకట్టుకు మెజారిటీ రైతుల అభిప్రాయం, ఉన్నతాధిల ఆదేశాలతో నీటి విడుదలపై నిర్ణయం తీసుకుంటామని ఇరిగేషన్ డీఈ బి.రవి అన్నారు. మండలంలోని మోపాడు బంగ్లావద్ద మంగళవారం మోపాడు రిజర్వాయర్ ఆయకట్టు పరిధి పామూరు, నెల్లూరుజిల్లా కొండాపురం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ దర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 16.7 అడుగుల నీరు ఉందన్నారు. బొట్లగూడూరు, కొత్తపల్లి, అపమాంబాపురం, కొండాపురం, ఎర్రబల్లి తదితర గ్రామాలవారు డిసెంబర్‌లో ఆరుతడి పంటలకు నీరు ఇవ్వాలని కోరారన్నారు. అదే విధంగా బొట్లగూడూరులో కొందరు, మోపాడు, కొండారెడ్డిపల్లి, లక్ష్మీనరసాపురం, తూర్పు కట్టకిందపల్లె గ్రామాల రైతులు వరిసాగుకు నీరు ఇవ్వాలని కోరారన్నారు. నీటి విడుదలపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి, సాగుకు అవసరమయ్యే నీటిపై జిల్లా అధికారులతో చర్చించి నీటి విడుదలపై ప్రకటన చేస్తామన్నారు.

రైతాంగాన్ని ఆదుకోవాలి

నీటి విడుదలపై రైతులతో చర్చింది తదనుగుణంగా నీరు విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని వైఎస్సా సీపీ మండల అధ్యక్షుతు గంగసాని హుసేన్‌రెడ్డి ఇరిగేషన్ డీఈని కోరారు. రిజర్వాయర్‌లో నీరు వృథా కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన డీఈని కోరారు. కార్యక్రమంలో ఖాదర్‌బాషా, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, మండలంలోని రైతులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

[illegible]

బాపూడి రంగరాజు, బాపూడి యజ్ఞదత్, అడ్వకేట్స్
రైలుపేట, గుంటూరు. సెల్: 9618398390

పేదలకు మెరుగైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం

● జగనన్న ఆరోగ్య సురక్ష సక్సెస్ మీట్‌లో డీవైఎంహెచ్‌ఓ మాధవీలత



కేక్ కట్ చేస్తున్న డీవైఎంహెచ్‌ఓలు మాధవీలత, వాణిశ్రీ

సింగరాయకొండ: పేద ప్రజల ఆరోగ్య రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతమైందని డీవైఎంహెచ్‌ఓ మాధవీలత పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సక్సెస్ మీట్‌లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ మాధవీలత మాట్లాడుతూ.. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రాష్ట్రంలోనే ప్రకాశం జిల్లా మొదటి స్థానంలో ఉండగా సింగరాయకొండ మండలం జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిందని వెల్లడించారు. మండలంలో 9,637 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 149 మందిని ఒంగోలు జీజీహెచ్‌కు రిఫర్ చేసినట్లు వివరించారు. రిఫర్ చేసిన వారి ఆరోగ్యం మెరుగయ్యే వరకు వారి బాధ్యత వైద్యశాఖపై ఉంటుందన్నారు. కార్యక్రమం విజయవంతమయ్యేందుకు కృషి చేసిన వైద్య సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం కేక్ కట్ చేసి అందిరికీ పంచిపెట్టారు. వైద్యారోగ్య సిబ్బందిని ఘనంగా సత్కరించారు. డీవైఎంహెచ్‌ఓ వాణిశ్రీ, సీనియర్ మెడికల్ అధికారి డాక్టర్ సరస్వతి, డాక్టర్ ఎం.చైతన్యకృష్ణ, డాక్టర్ ధీరేందర్, డాక్టర్ వంశీధర్, డాక్టర్ ఉజ్వల, డాక్టర్ లీనారాఫెల్, ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్‌అలీ, సయ్యద్ అక్బర్‌బాషా, ల్యాబ్ టెక్నీషియన్ మహేంద్ర, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సాధికార యాత్రకు భారీ బందోబస్తు

కనిగిరి రూరల్: కనిగిరిలో బుధవారం ఉదయం జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రకు, సాయంత్రం నాల్గు గంటలకు జరిగే బహిరంగ సభకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ రత్నాకర రామరాజు తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. తనతో పాటు నల్గురు సీఐలు, 14 మంది ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులతో పాటు స్పెషల్ పార్టీ, ఏఆర్‌పార్టీ, బాంబ్ డిస్పోజల్ టీంలతో కలిపి మొత్తం 350 మంది సిబ్బంది బందో బస్తులో పాల్గొంటారని చెప్పారు. పోలీసులకు అందరూ సహరించాలని కోరారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.

నేడు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

ఒంగోలు: జిల్లాలో ఎంపిక చేసిన ఏడు పాఠశాలల్లో బుధవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ వీఎస్ సుబ్బారావు, జిల్లాలోని సంబంధిత మండల విద్యాశాఖాధికారులు, హెడ్మాస్టర్లను మంగళవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ఒంగోలు, టంగుటూరు, దర్శి(ఒంగోలు డివిజన్), మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, వై.పాలెం(మార్కాపురం డివిజన్)లో నిర్వహించాల్సి ఉంటుందన్నారు. డివిజన్ కేంద్రాల్లో ఆయా డివిజన్ ఉప విద్యాశాఖ అధికారులు ఇన్‌చార్జి బాధ్యత వహిస్తారన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏడు సెషన్స్‌లో మీటింగ్ నిర్వహించడం జరుగుతుందని, కొన్ని సెషన్స్ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తామని తెలిపారు. ఒక్కో కేంద్రానికి ఏయే మండలాలు కేటాయింపు జరిగిందో కాంప్లెక్స్ నిర్వహణ విధి విధానాలు, అజెండాను జిల్లాలోని అందరు ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులకు మెయిల్ చేశామన్నారు. ప్రతి నెల ఈ మీటింగ్ల నిర్వహణ ఉంటుందని, అందరూ తప్పక హాజరుకావాలని డీఈఓ ఆదేశించారు.

సామాజిక సాధికార యాత్రకు సంసిద్ధం

● పట్టణంలో భారీ కటౌట్‌లు, ఫ్లెక్సీలు, తోరణాల ఏర్పాటు



చర్చి సెంటర్‌లో ఏర్పాటు చేసిన భారీ కటౌట్

కనిగిరి రూరల్: పట్టణంలో బుధవారం జరగనున్న సామాజిక, సాధికార బస్సుయాత్రకు, బహిరంగ సభకు ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. ఈమేరకు పట్టణంలో ఏర్పాటు చేసిన ఎయిర్ బెలూన్స్, భారీ కటౌట్‌లు ఆకర్షణగా నిలిచాయి. సాయంత్రం 4 గంటలకు జరిగే బహిరంగ సభ ప్రాంతంలో, మండలంలోని నందనమార్లెలో ప్రత్యేక ఆకర్షణగా స్వాగత ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యే ఈ కార్యక్రమానికి తగిన బందోబస్తు ఏర్పాటు చేశారు.